PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

సంస్కృతి సంప్రదాయాల పరిమళంతో బంజారా మహోత్సవం



3లో

పేద విద్యార్థినుల పాలిట ఆపన్నహస్తం: రమా జ్యోతి



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 326 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 19 నవంబర్ 2026

ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో

సముచిత స్థానం

- రాజకీయ ప్రాతినిధ్యం నుంచి విద్య, వైద్యం, ఉపాధి వరకు ప్రత్యేక ప్రాధాన్యత.. అణగారిన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఆయా వర్గాలకు సముచిత అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వెల్లడించారు. బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో పార్లమెంటరీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ డాక్టర్ ఫగ్గన్ సింగ్ కులస్తే, ఇతర సభ్యులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను

మిగతా2లో...


2లో

ప్రధాని మోదీతో ప్రిన్స్ విలియం, కేట్ భేటీ

- మూడు రోజుల భారత పర్యటన ముగింపు.. భారత్‌బ్రిటన్ సంబంధాలు, వాణిజ్యం, పర్యావరణ అంశాలపై చర్చ



ఆసియా-పసిఫిక్ దేశాల ఐక్యతకు జిన్‌పింగ్ పిలుపు

- పరస్పర సహకారం, శాంతి, స్వేచ్ఛా వాణిజ్యంతో ఉమ్మడి అభివృద్ధి సాధిద్దామని సూచన

షెన్‌జెన్,నవంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్): ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని దేశాలన్నీ విభేదాలను పక్కనపెట్టి, పరస్పర సహకారంతో ఒకే కుటుంబంలా ముందుకు సాగాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ప్రాంతీయ శాంతి, ఆర్థిక స్థిరత్వం, ఉమ్మడి అభివృద్ధి కోసం దేశాల మధ్య సహకారం మరింత బలోపేతం కావాలని ఆయన

మిగతా2లో...

నాగార్జునసాగర్‌లో జలదోపిడీకి కుట్ర!

- తాగునీటి పేరుతో 9 టీఎంసీల నీటి తరలింపునకు ప్రయత్నం.. తెలంగాణ హక్కులను కాపాడాలి: కేటీఆర్



హైదరాబాద్,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): నాగార్జునసాగర్‌లో భారీ సొరంగం నిర్మించి తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తాగునీటి పథకం పేరుతో డెడ్‌స్టోరేజీ నుంచి తొమ్మిది టీఎంసీల నీటిని తరలించేందుకు ఎలాంటి అనుమతులు లేకుండా పనులు చేపడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ విజయపురి సౌత్ వద్ద ఏడాదిగా సొరంగం నిర్మాణ పనులు జరుగుతున్నాయని,

మిగతా2లో...

భారత్ ఆర్థిక విపత్తు దిశగా పయనం!

- దేశంలో నిరుద్యోగం తీవ్రం.. విద్యావ్యవస్థలోనూ లోపాలు.. తయారీ రంగాన్ని బలోపేతం చేయాలి: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోందని, భారత్ ఆర్థిక విపత్తు అంచున ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. అమెరికాలోని న్యూయార్క్ కొలంబియా యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులతో జరిగిన సమావేశంలో ఆయన దేశ ఆర్థిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, విద్యా వ్యవస్థలోనూ అనేక లోపాలున్నాయని పేర్కొన్నారు. దేశ యువతకు భవిష్యత్తుపై భరోసా కలగడం లేదన్నారు. దాదాపు దశాబ్ద కాలంగా దేశ ఆర్థిక నమూనా ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదని విమర్శించారు.చిన్న, మధ్య తరహా

మిగతా2లో...



నేడు సిద్ధిపేటకు సీఎం రేవంత్ రెడ్డి

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం.. రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

సిద్ధిపేట,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సిద్ధిపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు.మొత్తం

మిగతా2లో...



ఇందిరమ్మ బీమాకు ప్రత్యేక కేంద్రాలు

- గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ.. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

హైదరాబాద్,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని పథకంలో నమోదు చేయాలని, ఎవరూ మిగిలిపోకుండా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.బుధవారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో సమావేశంలో పథకం అమలు ఏర్పాట్లపై సమీక్షించారు.

మిగతా2లో...

పేద విద్యార్థులకు కిషన్‌రెడ్డి భరోసా

- 4,741 మంది పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజుల చెల్లింపు బాధ్యత స్వీకరణ.. 87 ప్రభుత్వ పాఠశాలలకు లబ్ధి



హైదరాబాద్,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్‌రెడ్డి మరోసారి తన వంతు సహకారం అందించేందుకు ముందుకొచ్చారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని 87 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 4,741 మంది విద్యార్థుల పరీక్ష ఫీజులను ఆయనే చెల్లించనున్నారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులపై పరీక్ష ఫీజుల భారం పడకుండా

మిగతా2లో...

ఎస్సీ, ఎస్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం

(మొదటి పేజీ తరువాయి)

వివరించారు. **రాజకీయ రంగంలోనూ ప్రాధాన్యత** ఎస్సీ, ఎస్టీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. శాసనసభ స్పీకర్, మంత్రులుగా దళితులకు అవకాశం కల్పించామని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలోనూ ప్రాధాన్యత ఇచ్చామని పేర్కొన్నారు. ప్రభుత్వంలోని కీలక పదవుల్లో అర్హత, అవకాశాలను బట్టి ఆయా వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తున్నామని వివరించారు. **ఉన్నత విద్యలో కీలక అవకాశాలు**ఉన్నత విద్యా రంగంలోనూ సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నామని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఐఐఐటీలకు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారిని ఉపకులపతులుగా నియమించి అవకాశం కల్పించామని తెలిపారు. విద్యాసంస్థల్లో సమాన అవకాశాలు కల్పించడం ద్వారా ఆయా వర్గాల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యతఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం వివరించారు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్), ఆరోగ్యశ్రీ పథకాల కింద విడుదల చేస్తున్న నిధుల్లో 50 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారుల కోసం ఖర్చు చేస్తున్నామని తెలిపారు. పేద కుటుంబాలకు వైద్య సహాయం అందించడంతో పాటు గృహ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. **ఎస్సీ వర్గీకరణ అమలు** దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. రిజర్వేషన్ల ప్రయోజనాలు అత్యంత వెనుకబడిన వర్గాలకు అందేలా ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు ద్వారా నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

ప్రభుత్వ చర్యలను అభినందించిన కమిటీ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం చేపడుతున్న చర్యలను పార్లమెంటరీ కమిటీ సభ్యులు అభినందించారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ అమలు, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలల ఏర్పాటు వంటి కార్యక్రమాలపై ప్రశంసలు వ్యక్తం చేశారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీగణేశ్, పార్లమెంటరీ కమిటీ సభ్యులు తపిర్ గావ్, హరిశ్చంద్ర మీనా, అనిల్ ఫిరోజియా, అరుణ్‌కుమార్, డి. ప్రసాదరావు తదితరులు, రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కృష్ణా బేసిన్‌కు మీరేం చేశారు?

తెలంగాణ నీటి వాటాపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్.. సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి అవసరాలపై ప్రశ్నలు



హైదరాబాద్,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): కృష్ణా నదీ జలాల వినియోగం, పంపిణీలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కృష్ణా బేసిన్‌లోని జిల్లాలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలేంటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ వద్ద ఆంధ్రప్రదేశ్ చేపడుతున్నట్లు ఆరోపిస్తున్న నీటి తరలింపు పనులను అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. తాగునీటి పథకం పేరుతో సుమారు 9 టీఎంసీల నీటిని తరలించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జలశక్తి శాఖకు ప్రభుత్వం ఏం ఫిర్యాదు చేసిందని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటా కోసం ప్రభుత్వం గట్టిగా పోరాడాలని అన్నారు. హైదరాబాద్‌తో పాటు పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మిగిలిన 40 టీఎంసీల కేటాయింపుపై స్పష్టత ఇవ్వాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల పురోగతిపైనా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఏపీ ప్రతిపాదించిన 1.8 టీఎంసీల తాగునీటి పథకంపై కృష్ణా బోర్డు, కేంద్ర జలశక్తి శాఖకు అభ్యంతరాలు తెలిపిందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. తెలంగాణకు 555 టీఎంసీల నీటి వాటా కోరుతూ ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర నీటి హక్కుల విషయంలో రాజీ పడబోమని స్పష్టం చేశారు.

భారత్ ఆర్థిక విపత్తు దిశగా పయనం!

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమలు, వ్యవసాయమే భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధాన బలమని రాహుల్ అన్నారు. ఈ రంగాలే పెద్దఎత్తున ఉపాధి కల్పిస్తాయని, తయారీ రంగాన్ని తిరిగి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా పథకాలు ఆశించిన స్థాయిలో తయారీ రంగాన్ని అభివృద్ధి చేయలేకపోయాయని విమర్శించారు. సేవారంగం ద్వారా మాత్రమే దేశంలోని యువతకు తగినంత ఉపాధి కల్పించడం సాధ్యం కాదన్నారు. దేశంలో ప్రైవేటు పెట్టుబడులు ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించిన రాహుల్.. కొద్ది పెద్ద వ్యాపార సంస్థలకే అభివృద్ధి అవకాశాలు పరిమితమవుతున్నాయని ఆరోపించారు. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలంటే చిన్న పరిశ్రమలు, వ్యవసాయం, తయారీ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. **రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు** రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. విదేశీ వేదికలపై దేశ ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యంపై ప్రతికూల వ్యాఖ్యలు చేస్తూ భారత్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని పేర్కొన్నారు. దేశ ప్రగతిని రాహుల్ గాంధీ జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. దీంతో అమెరికాలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య మరోసారి రాజకీయ విమర్శలకు దారితీశాయి.

పేద విద్యార్థులకు కిషన్‌రెడ్డి భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక కారణాలతో ఏ ఒక్క విద్యార్థి కూడా పరీక్షలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు చదువుపై మరింత ఆసక్తి పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు ప్రోత్సాహం అందించడమే ఈ సహకారం వెనుక ఉద్దేశమని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే ఈ కార్యక్రమాన్ని కిషన్‌రెడ్డి గత కొన్నేళ్లుగా కొనసాగిస్తున్నారు.

ఈ ఏడాది కూడా వేలాది మంది విద్యార్థుల పరీక్ష ఫీజుల బాధ్యతను స్వీకరించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత అందిస్తున్నారు. పదో తరగతి పరీక్షలను భయం లేకుండా, ఆత్మవిశ్వాసంతో రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

బరాక్ క్షిపణుల ఆధునికీకరణకు రూ.1,976 కోట్ల ఒప్పందం

- భారత నౌకాదళ రక్షణ వ్యవస్థ మరింత పటిష్టం.. ఇజ్రాయెల్ సంస్థతో రక్షణ శాఖ ఒప్పందం



న్యూఢిల్లీ,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): భారత నౌకాదళ యుద్ధనౌకల్లో మోహరించిన బరాక్ పాయింట్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థల ఆధునికీకరణకు రక్షణ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకోసం ఇజ్రాయెల్‌కు చెందిన ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ (ఐఏఐ) సంస్థతో రూ. 1,976.40 కోట్ల ఒప్పందంపై బుధవారం సంతకాలు చేసింది. న్యూఢిల్లీలో రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంలో భాగంగా బరాక్ క్షిపణి వ్యవస్థల హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను ఆధునికీకరించడంతో పాటు పాతబడిన పరికరాలకు నిర్వహణ చేపట్టనున్నారు. దీనివల్ల క్షిపణి వ్యవస్థల పనితీరు, రక్షణ సామర్థ్యం మరింత మెరుగుపడనున్నాయి. బరాక్ వ్యవస్థలు భారత నౌకాదళ యుద్ధనౌకలను వైమానిక దాడులు, ఇతర గగనతల ముప్పుల నుంచి రక్షించేందుకు ఉపయోగపడతాయి. తాజా ఆధునికీకరణతో నౌకాదళానికి మరింత శక్తిమంతమైన, సుదూర వైమానిక రక్షణ సామర్థ్యం అందుబాటులోకి రానుంది.

ప్రధాని మోదీతో ప్రిన్స్ విలియం, కేట్ భేటీ

న్యూఢిల్లీ,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియం, యువరాణి కేట్ మిడిల్టన్ బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. మూడు రోజుల భారత పర్యటన ముగింపు సందర్భంగా జరిగిన ఈ భేటీలో భారత్‌బ్రిటన్ ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ సహకారంపై చర్చించారు. ముంబైలో జరిగిన ఎర్త్‌షాట్ ప్రైజ్ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రాజ దంపతులు ఢిల్లీకి చేరుకున్నారు. పర్యావరణ సమస్యలకు వినూత్న పరిష్కారాలను ప్రోత్సహిస్తున్న ఎర్త్‌షాట్ ప్రైజ్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ అభినందించారు. పర్యావరణ పరిరక్షణలో భారతీయ ఆవిష్కరణలు, ప్రతిభను ప్రపంచానికి చాటుతున్న ఈ కార్యక్రమం ప్రాధాన్యతను కొనియాడారు. భారత్, బ్రిటన్ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని మోదీ ఆకాంక్షించారు. ఇటీవల అమల్లోకి వచ్చిన ఇరు దేశాల సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వారా ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపునిచ్చి, ఇరు దేశాల ప్రజలకు ప్రయోజనాలు కల్పించాలని పేర్కొన్నారు. భారత పర్యటనలో భాగంగా ప్రిన్స్ విలియం ముంబైలోని ప్రముఖ సినీ నిర్మాణ సంస్థను సందర్శించగా, కేట్ మిడిల్టన్ ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడారు. క్రికెట్, సాంస్కృతిక కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాల్లోనూ రాజ దంపతులు పాల్గొన్నారు.

ఆసియా-పసిఫిక్ దేశాల ఐక్యతకు జిన్‌పింగ్ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

ఆకాంక్షించారు. ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార వేదిక (ఏపీఈసీ) సమావేశం నేపథ్యంలో నిర్వహించిన సీఈఓల సదస్సులో జిన్‌పింగ్ ప్రసంగించారు. స్వేచ్ఛా వాణిజ్యం, పరస్పర విశ్వాసం, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ప్రాంతీయ అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ, దేశాలు కలిసి పనిచేస్తే అభివృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించుకోవచ్చని తెలిపారు. చైనా 20262030 పంచవర్ష ప్రణాళిక ప్రపంచ దేశాలకు, ముఖ్యంగా పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలను అందిస్తుందని వివరించారు. ఆర్థిక, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించుకోవాలని సూచించారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో ఏపీఈసీ సభ్య దేశాల ప్రతినిధులతో పాటు పలువురు ప్రపంచ నాయకులు, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చిలీ అధ్యక్షుడు జోస్ ఆంటోనియో కాస్ట్, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంలు హాజరయ్యారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతం లో పరస్పర సహకారం, వాణిజ్య సంబంధాల బలోపేతంపై ఈ సమావేశంలో చర్చలు జరగనున్నాయి.

నేడు సిద్ధిపేటకు సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

రూ.544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.451 కోట్ల పనులకు శంకుస్థాపనలు, రూ.93 కోట్ల పనులను ప్రారంభించనున్నారు.

అలాగే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి దామోదర రాజనర్సింహ సభా ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభకు భారీగా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో తాగునీరు, పార్కింగ్, బారికేడ్లు, భద్రత, వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇందిరమ్మ బీమాకు ప్రత్యేక కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి గ్రామ పంచాయతీతో పాటు మున్సిపాలిటీల్లోని వార్డుల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, దరఖాస్తు ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ నమోదు సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు రూ. 5 లక్షల జీవిత బీమా కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం వివిధ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నారు. ఇప్పటికే నేతన్నలు, గీత కార్మికులు, ఇతర కార్మిక వర్గాలకు అందిస్తున్న జీవిత బీమా మొత్తాన్ని రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచడంతో పాటు ప్రస్తుత ప్రమాద బీమా ప్రయోజనాలను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నమోదు ప్రక్రియలో స్వయం సహాయక సంఘాల సేవలను వినియోగించుకోవాలని, అర్హులైన కుటుంబ సభ్యుల వివరాలు, బీమా పొందే వ్యక్తి, నామినీల వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెల 19 నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభం కానుండగా, అర్హులైన కుటుంబాలందరికీ పథకం ప్రయోజనాలు అందేలా చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు.

నాగార్జునసాగర్‌లో జలదోపిడీకి కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

510 అడుగుల డెడ్‌స్టోరేజీ స్థాయి నుంచి కూడా నీటిని తరలించేలా ప్రణాళిక రూపొందించారని ఆరోపించారు. సుమారు 1,650 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మించి నీటిని తరలించే ప్రయత్నం జరుగుతోందని, తాగునీటి పథకం ముసుగులో సాగునీటిని కూడా తరలించే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా గతంలో వ్యవహరించిన ఆదిత్యనాథ్ దాస్‌ను రాష్ట్ర సాగునీటి సలహాదారుగా ఎలా నియమించారని కేటీఆర్ ప్రశ్నించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఆయన కేంద్రానికి లేఖలు రాశారని ఆరోపించారు. ఈ నియామకంపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు మిగిలిన 40 టీఎంసీలను తాగునీటి అవసరాలకు కేటాయించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు లేఖ రాశారా లేదా స్పష్టం చేయాలన్నారు. హైదరాబాద్‌తో పాటు పాలమూరు, నల్లగొండ, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాలపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరారు. కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు మొదటి నుంచీ అన్యాయం జరిగిందని కేటీఆర్ విమర్శించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు 8.8 లక్షల ఎకరాలకు నీరు అందిస్తామని చెప్పినా ప్రస్తుతం ఆరు లక్షల ఎకరాలకు మించి అందడం లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులను నిలిపివేయడంపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్‌లో నీటి తరలింపు ప్రయత్నాలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ న్యాయపోరాటంతో పాటు ప్రజా ఉద్యమం చేపడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు. నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించడంతో పాటు మహబూబ్‌నగర్ జిల్లాలోనూ నీటి హక్కుల కోసం ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు జి. జగదీశ్‌రెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, రవీంద్ర నాయక్, గ్యాదరి కిశోర్, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌ను కలిసిన ఆర్టీసీ ఎండీ

హైదరాబాద్,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): టీజీఎస్ ఆర్టీసీ నూతన వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనిల్‌కుమార్ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ భేటీలో ఆర్టీసీ ప్రస్తుత పరిస్థితి, సంస్థ అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పన, సంస్థను మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు. ఆర్టీసీ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నారు.

సంస్కృతి సంప్రదాయాల పరిమళంతో బంజారా మహోత్సవం

- ఈ నెల 22న రఘునాథపాలెంలో అంగరంగ వైభవంగా వనవహోత్సవ వేడుకలు

- ఉమ్మడి ఖమ్మం జిల్లా బంజారా కుటుంబాలన్నింటికీ ఆత్మీయ ఆహ్వానం

- వనసమారాధన మహోత్సవ కమిటీ కన్వీనర్ పోరిక లచ్చిరాం నాయక్



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): కుల బంధాల ఆత్మీయతను చాటుతూ.. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని భావితరాలకు అందిస్తూ.. బంజారా జాతి ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా ఈ నెల 22న ఆదివారం బంజారాల వన సమారాధన మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు వనమహోత్సవ కమిటీ కన్వీనర్ పోరిక లచ్చిరాం నాయక్ తెలిపారు. పార్టీలు, వర్గాలు, సంఘాలకు అతీతంగా బంజారా కుటుంబాలన్నీ ఒకే కుటుంబంలా కలిసిమెలిసి ఆనందంగా గడిపేలా ఈ మహోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలోని నాగమ్మ గుడి ఎదురుగా ఉన్న ఆర్జీబీ మామిడి తోటలో ఆదివారం ఈ వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా నలుమూలల నుంచి బంజారా కుటుంబాల సభ్యులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, కార్మికులు, కర్షకులు, కళాకారులు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు కుటుంబ సమేతంగా తరలివచ్చి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆహ్వానించారు. బుధవారం ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. బంజారా జాతి ఐక్యత, అభివృద్ధి, సంక్షేమంతో పాటు విశిష్టమైన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయాలనే గొప్ప సంకల్పంతో ఈ వన సమారాధనకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. నేటి బిజీ జీవితాల్లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయులు కలిసి మనసారా మాట్లాడుకునే అవకాశాలు తగ్గుతున్న నేపథ్యంలో.. జాతి మొత్తాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చి అనుబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ వేడుక ప్రధాన ఉద్దేశమని వివరించారు. నీతి, నిజాయితీ, కష్టపడి జీవించే తత్వానికి ప్రతీకగా నిలిచే బంజారా జాతి గొప్పతనాన్ని చాటేలా సంప్రదాయ కళలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. బంజారా నృత్యాలు, నెమలి నాట్యం, బిందెలతో చేసే సంప్రదాయ నృత్యాలు, కళాకారుల డప్పు వాయిద్యాలు, ఆటపాటలు, ఆనందోత్సాహాల నడుమ రోజంతా ఉత్సవ వాతావరణం నెలకొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పిల్లలు తమ జాతి మూలాలను, పెద్దలు తమ సంస్కృతి వైభవాన్ని మరోసారి గుర్తుచేసుకునేలా.. యువత సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకునేలా ఈ మహోత్సవం నిలవనుంది. కుటుంబాల మధ్య ఆప్యాయతలు పెంపొందిస్తూ, ఆత్మీయ పలకరింపులు, అనుబంధాల కలయికతో ప్రతి ఒక్కరికీ మధుర జ్ఞాపకాలను అందించాలనే లక్ష్యంతో కమిటీ సభ్యులు రాత్రింబవళ్లు శ్రమిస్తూ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకను ఒక సంఘానికి లేదా ఒక వర్గానికి పరిమితం చేయకుండా యావత్ బంజారా జాతి కుటుంబ సమ్మేళనంగా నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ తమ సొంత ఇంటి పండుగగా భావించి తరలిరావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. బంజారా జాతి ఐక్యతను చాటుతూ, రాబోయే తరాలకు సంస్కృతి సంప్రదాయాల వారసత్వాన్ని అందించే ఈ మహోత్సవాన్ని అందరి భాగస్వామ్యంతో చిరస్మరణీయంగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో కో-కన్వీనర్లు భూక్యా మంగ్య నాయక్, మాలోత్ రామారావు నాయక్, కోశాధికారులు డాక్టర్ మంగీలాల్ జాదవ్, గంగావత్ రమేష్ నాయక్, కార్యదర్శులు భూక్యా శోభన్ నాయక్, భూక్యా చంద్రు నాయక్, వి. తిరుపతి నాయక్, గౌరవ సలహాదారులు మూడ్ బాల్ సింగ్ నాయక్, ధరంసోత్ చక్రవర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినుల పాలిట ఆపన్నహస్తం: రమా జ్యోతి

- గురుకుల బాలికల భవిష్యత్తుకు భరోసా కల్పించిన బిలీప్ హాస్పిటల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్

- అనంతనగర్ గురుకులంలో 350 మంది విద్యార్థినులకు ఉచిత మెగా వైద్య శిబిరం

- ప్రతిభావంతులు, అనాథ విద్యార్థినులకు రూ.25 వేల ఆర్థిక సాయం.. పాఠశాలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు హామీ









ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) : పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదు.. ఆర్థిక ఇబ్బందులు విద్యార్థినుల ఆరోగ్యానికి, విద్యాభివృద్ధికి అవరోధం కాకూడదనే గొప్ప మానవీయ సంకల్పంతో బిలీప్ హాస్పిటల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రమా జ్యోతి తన సేవా హృదయాన్ని చాటుకున్నారు. చదువుకోవాలనే తపన ఉన్న పేద బాలికలకు ఆరోగ్య భరోసా కల్పిస్తూ, ప్రతిభావంతులైన విద్యార్థినులను ప్రోత్సహిస్తూ, తల్లిదండ్రుల ఆదరణకు దూరమైన చిన్నారులకు ఆర్థిక చేయూతనిస్తూ వారి జీవితాల్లో ఆశాదీపంగా నిలిచారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అనంతనగర్ గురుకుల పాఠశాలలో బుధవారం పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో బిలీప్ హాస్పిటల్ సహకారంతో విద్యార్థినులకు ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరంలో బిలీప్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సత్య ప్రసన్న, డాక్టర్ సుజాత విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన రక్త పరీక్షలు చేశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాలికలకు తగిన వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మందులు అయిపోయిన తర్వాత కూడా అవసరమైన విద్యార్థినులు ఆసుపత్రికి వచ్చి ఉచితంగా మందులు పొందవచ్చని రమా జ్యోతి హామీ ఇచ్చారు. వైద్య శిబిరం నిర్వహించడంతోనే తన బాధ్యత ముగిసిందని భావించకుండా విద్యార్థినులతో ఆత్మీయంగా మమేకమయ్యారు రమా జ్యోతి. మధ్యాహ్న భోజన సమయంలో చిన్నారులతో కలిసి భోజనం చేస్తూ వారితో సరదాగా ముచ్చటించారు. వారి సమస్యలు, అవసరాలు, అభిరుచులను తెలుసుకుంటూ రోజంతా వారితో గడిపారు. సుమారు 350 మంది విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థినులు తమకు సౌండ్ బాక్స్ స్పీకర్, చల్లని నీటి కోసం ఫ్రిజ్ అవసరమని కోరగా, వాటిని అందజేస్తానని రమా జ్యోతి హామీ ఇచ్చారు. మందుల అవసరం ఉన్నప్పుడు తమ ఆసుపత్రిని సంప్రదించవచ్చని భరోసా కల్పించారు. దీంతో విద్యార్థినుల్లో ఆనందం వెల్లివిరిసింది. గురుకుల పాఠశాలలో గత సంవత్సరం పదో తరగతిలో ప్రథమ ర్యాంకులు సాధించిన ఇద్దరు విద్యార్థినులతో పాటు తల్లిదండ్రులు లేని మరో ముగ్గురు విద్యార్థినులను గుర్తించి మొత్తం ఐదుగురికి ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున రూ. 25 వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు ఆపన్నులైన చిన్నారులకు అండగా నిలవాలనే గొప్ప ఆలోచనతో అందించిన ఈ సహాయం విద్యార్థినుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా రమా జ్యోతి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని జీవితంలో ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడే వరకు వివాహం గురించి ఆలోచించకుండా, ముందుగా తమ కాళ్లపై తాము నిలబడే స్థాయికి ఎదగాలని హితవు పలికారు. బాగా చదువుకుని ఆర్థికంగా స్థిరపడితే జీవితంలో ఎన్నో సమస్యలను అధిగమించవచ్చని, ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడి సంతోషకరమైన జీవితాన్ని నిర్మించుకోవచ్చని తెలిపారు. పేదరికాన్ని చూసి వెనుకడుగు వేయకుండా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. పేద విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత మెగా హెల్త్ క్యాంపు నిర్వహించడం, అవసరమైన మందులు పంపిణీ చేయడం, ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు అందించడం, తల్లిదండ్రులు లేని చిన్నారులకు ఆర్థిక అండగా నిలవడం, పాఠశాల అవసరాలను తీర్చేందుకు ముందుకు రావడం వంటి సేవలను పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా బిలీప్ హాస్పిటల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రమా జ్యోతిని శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థినుల విద్యాభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణకు భవిష్యత్తులోనూ తన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ దుర్గా, హెల్త్ టీచర్ దివ్య, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గోపి నాగలక్ష్మి, కమిటీ సభ్యులు దుబ్బాకుల శ్రీనివాసరావు, తంగిరాల నరసింహారావు, బొడ్డు నాగరాజు, పెద్దపాక సైదులు, రాంబాబు, భరత్, అర్చన, రజిని తదితరులు పాల్గొన్నారు.



శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఘనంగా క్రీడా పోటీలు ప్రారంభం

● విద్యతో పాటు క్రీడలకు పెద్దపీట: ఏజీఎం మొగల్ నూర్ మహమ్మద్ అలీ





హైదరాబాద్ నవంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని శ్రీ చైతన్య విద్యాసంస్థల నారాయణగూడ జోన్ ఏజీఎం మొగల్ నూర్ మహమ్మద్ అలీ పేర్కొన్నారు. సంస్థ వ్యవస్థాపకులు స్వర్గీయ డాక్టర్ బి.ఎస్. రావు స్మారకార్థం హిమాయత్ నగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రాంచ్ స్థాయి క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మొగల్ నూర్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. బ్రాంచ్ ప్రిన్సిపాల్ శివాణి మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి వేదికలు ఎంతగానో దోహదపడతాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం అలవడుతాయని వివరించారు. ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేష్, కోఆర్డినేటర్ రాజేంద్ర ప్రసాద్, జోన్ పీఈటీ ఇన్‌చార్జి వీరు, డీన్ రమేష్, సి-ఇన్‌చార్జి సరిత, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జి వనిత, ప్రైమరీ ఇన్‌చార్జి ప్రసన్న, వ్యాయామ ఉపాధ్యాయులు రవీందర్, అపర్ణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిసెంబర్ 19న 'హైదరాబాద్ గ్లోబల్ ఐకాన్స్ అవార్డ్స్ 2026'



హైదరాబాద్, నవంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్): వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచి, సమాజాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రముఖులను సత్కరించేందుకు 'ఎలైట్ లీడర్‌షిప్ కౌన్సిల్' ఆధ్వర్యంలో 'హైదరాబాద్ గ్లోబల్ ఐకాన్స్ అవార్డ్స్ 2026' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. డిసెంబర్ 19వ తేదీన బేగంపేటలోని కంట్రీ క్లబ్‌లో ఈ వేడుకను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు కౌన్సిల్ అధ్యక్షుడు చైతన్య జంగా, ఉపాధ్యక్షుడు పాకలపాటి విజయ వర్మ బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కళలు, సినిమా, వ్యాపారం, విద్య, వైద్యం, సాంకేతికత, మీడియా, సామాజిక సేవ, మహిళా సాధికారత తదితర రంగాల్లో ప్రతిభావంతుల విజయగాథలను ప్రపంచానికి పరిచయం చేయడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని వారు పేర్కొన్నారు. ఈ వేడుకకు పలువురు రాష్ట్ర మంత్రులతో పాటు సినీ నటి లయ ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు. మరిన్ని వివరాలకు 98663 33787, 98486 69996 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఫ్లయర్‌ను కంట్రీ క్లబ్ చైర్మన్ రాజీవ్ రెడ్డి ఆవిష్కరించి, నిర్వాహకులను అభినందించారు. ఈ సమావేశంలో సినీ నటీమణులు, మోడల్స్ మేఘ బెనర్జీ, ప్రతిమ మౌర్య, భావన శర్మ, ఫిట్‌నెస్ గురు అను ప్రసాద్, వ్యాపారవేత్త మహేష్ కుమార్, మిథాని ఈశ్వర్, కోడె చైతన్య, రామిశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్న వయసులోనే హైకోర్టులో సత్తా చాటుతున్న ఖమ్మం యువ న్యాయవాది.. పుల్లబొట్ల శ్రీ చక్రపాణికి ప్రత్యేక గుర్తింపు!

రూ.25 వేల సైబర్ వివాదంలో విద్యార్థికి న్యాయపరమైన ఊరట.. పదునైన వాదనలతో ఆకట్టుకుంటున్న యువ న్యాయవాది

సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ జూస్తి చలమేశ్వర్ వద్ద ఇంటర్న్‌షిప్.. న్యాయరంగంలో ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు

ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): చిన్న వయసులోనే న్యాయరంగంలో తనదైన ముద్ర వేస్తూ, తెలంగాణ హైకోర్టులో కీలకమైన కేసుల్లో సమర్థవంతమైన వాదనలు వినిపిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు యువ న్యాయవాది పుల్లబొట్ల వివిఎన్ శ్రీ చక్రపాణి. పట్టుదల, అంకితభావం, చట్టాలపై లోతైన అవగాహనతో క్లిష్టమైన న్యాయపరమైన అంశాలను సైతం సమర్థవంతంగా విశ్లేషిస్తూ ముందుకు సాగుతున్నారు. తక్కువ సమయంలోనే న్యాయవాద వృత్తిలో మంచి గుర్తింపు సంపాదించుకోవడం విశేషం. సైబర్ నేరానికి సంబంధించిన రూ. 25 వేల లావాదేవీ వివాదంలో ఒక విద్యార్థి బ్యాంకు ఖాతా పూర్తిగా నిలిచిపోవడంతో ఎదురైన సమస్యను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లి, వివాదాస్పద మొత్తంపై మాత్రమే లియన్ కొనసాగిస్తూ మిగిలిన ఖాతా లావాదేవీలకు అనుమతించేలా ఆదేశాలు పొందడంలో శ్రీ చక్రపాణి కీలక పాత్ర పోషించారు. ఇందుకోసం ఐదు పూర్వ న్యాయ తీర్పులను ఆధారాలుగా సమర్పించి తన న్యాయపరిజ్ఞానాన్ని చాటుకున్నారు. ఇక సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, మాజీ న్యాయమూర్తి జస్టిస్ జూస్తి చలమేశ్వర్ వద్ద ఇంటర్న్‌షిప్ చేయడంతో పాటు ప్రముఖ న్యాయ సంస్థలో డిస్ప్యూట్ రిజల్యూషన్ విభాగంలో పనిచేసిన అనుభవం ఆయన న్యాయప్రస్థానానికి మరింత బలాన్నిచ్చింది. యువ వయసులోనే న్యాయరంగంలో ప్రతిభను చాటుకుంటున్న శ్రీ చక్రపాణి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని న్యాయవాదులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షిస్తున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ మహమ్మద్ మొహీజ్



రామడుగు, నవంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్): రామడుగు గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం రామడుగు గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ మహమ్మద్ మొహీజ్ ఉప సర్పంచ్, పాలకవర్గం వార్డు సభ్యులు, ఆర్ఐ మరియు జిపిఒ, కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఇట్టి కార్యక్రమానికి రామడుగు PACS చైర్మన్ కోల రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రామడుగు PACS చైర్మన్ కోల రమేష్ సర్పంచ్ మహమ్మద్ మొహిజ్ ఉప సర్పంచ్ పెందోట రాజు కార్యదర్శి శ్రీనివాస్ ఆర్ ఐ కమలేష్ జిపిఒ బాపుదేవ్ కాంగ్రెస్ నాయకులు పొన్నం మల్లేశం మరియు పాలకవర్గం వార్డు సభ్యులు మామిడి దిలీప్ కుమార్, కర్నె శ్రీలత – శ్రీనివాస్ , ఎండీ ఆరీఫ్,రాగం స్వప్న – రవి,సామంతుల సుజాత – తిరుపతి,సిరికొండ పల్లవి – సాయి తేజ,నీలం అరుణ – లక్ష్మణ్,మామిడి శ్రవణ్,కారుపాకల నరేష్,చంద అనిల్,మ్యాదారం అర్చన – అనిల్,మామిడి కుమార్, సిరిగిరి వెంకటేష్ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి

- ప్రభుత్వం, దళారులు కలసి రైతులను దోచుకుంటున్నారు
- రైతు ప్రభుత్వం పేరుతో రైతు నడ్డి విడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్



రామడుగు నవంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్): భారతీయ జనతా పార్టీ రామడుగు మండల శాఖ అధ్యక్షులు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం లో బారి నిరసన కార్యక్రమం నిర్వహించి,తహశీల్దార్ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ రైతులు వరి ధాన్యం ఐకెపి సెంటర్లలో,ఫ్యాక్స్ లో, కల్లాల దగ్గర పోసి నెల రోజులు గడుస్తున్న ధాన్యాన్ని కొనుగులు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయక దళారుల చేతుల్లో రైతులు మోసపోతున్నారని ఆవేదన చెందుతున్నారని అన్నారు. దళారులు,అధికారులు,ఎమ్మెల్యే అందరూ కలసి రైతులను తక్కువ ధరకు మద్దతు ధర రాకుండా రైతులను ఆర్థికంగా నష్టపోయేలా చేస్తున్నారని ఆరోపించారు. సన్నలకు 500 బోనస్ లు ఇవ్వాలని వడ్ల కొనుగోలులను ప్రారంభించడం లేదని,ప్రభుత్వనికి రైతులకు బోనస్ ఇవ్వలేకనే తూకం మొదలుపెట్టడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ధాన్యాన్ని ప్రభుత్వంమే కొనుగోలు చేయాలని లేని పక్షంలో రైతులతో కల్సి కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పు శ్రీనివాస్, బండ తిరుపతి రెడ్డి,మహిళ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మామిడిపెల్లి చైతన్య,మండల ప్రధాన కార్యదర్శి పోచంపెల్లి నరేష్,బారి ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు.

మల్లంపల్లికి ఆసుపత్రి, 108 అంబులెన్స్ ఏర్పాటు చేస్తాం

- బీఆర్ఎస్ నాయకుల వినతికి మంత్రి సీతక్క హామీ



మల్లంపల్లి, నవంబర్ 18 (పీసీడబ్ల్యూ న్యూస్): ములుగు జిల్లాలో నూతనంగా ఏర్పడిన మల్లంపల్లి మండలానికి ప్రభుత్వ ఆసుపత్రి, 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ధనసరి సీతక్క హామీ ఇచ్చారు. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, ప్రభుత్వ భూముల ఆక్రమణలను తొలగించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు.మల్లంపల్లిలో జరిగిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రి హాజరైన సందర్భంగా మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు ఆమెను కలిసి వినతులు అందజేశారు. మండలంలో అత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆసుపత్రి, 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు.వినతిపై సానుకూలంగా స్పందించిన మంత్రి, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సర్వే నిర్వహించి, ఆక్రమిత భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. నూతన మండల కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వ భూమి అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకుల మల్లేష్, చిదర సంతోష్, మొర్రి రాజు, మహమ్మద్ పాషా, శ్రీనివాస్ రెడ్డి, మహమ్మద్ చోటే, మెరుగు రాజు, యండి రంజాన్, యాకుబ్, నజీర్, అంగర్, మూడేడ్ల నవీన్, శంకర్, పెద్ది రాకేష్ రెడ్డి, నత్తి మొగిలి, గోల్కొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- విద్య, క్రీడలకు ప్రాధాన్యత..
- రూ.2 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు: మంత్రి పొంగులేటి







కల్లూరు, నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్యూరిఫికేషన్ ప్లాంట్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ఇదే ట్రస్ట్ ద్వారా పాఠశాల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు నిధులు కేటాయించినట్లు గుర్తుచేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. తెలంగాణ నుంచి భవిష్యత్తులో అనేక మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు.పేద కుటుంబాల పిల్లలకు సైతం నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నామని, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో రూ. 25 కోట్ల వ్యయంతో టాటా సంస్థ భాగస్వామ్యంతో ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టామని, గురుకులాల్లో మెస్ చార్జీలను 40 శాతం, కాస్మొటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసిన పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎంపీ నిధులతో పాఠశాల క్రీడా మైదానంలో క్రీడా పరికరాలు, ఇతర సదుపాయాలు కల్పించినట్లు గుర్తుచేశారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని లక్ష్యాలను సాధించాలని కోరారు. కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయ క్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గాయాన్ని నిర్లక్ష్యం చేస్తే కాలు కోల్పోయే ప్రమాదం

- మధుమేహం ఉన్నంత మాత్రాన కాలు కోల్పోయే పరిస్థితిలేదు
- 'యశోద'లో మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఆధునిక వైద్యం
- యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) వాస్కులర్ సర్జన్, ఎండోవాస్కులర్ సర్జన్ డాక్టర్ ఎస్. శ్రీకాంత్ రాజు



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) : మధుమేహం (డయాబెటిస్).. నేడు ఎంతోమందిని వేధిస్తున్న దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య. అయితే మధుమేహం ఉందని తెలిసినవారు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడంపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతూ, పాదాల ఆరోగ్యాన్ని మాత్రం చాలాసార్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యమే కొన్నిసార్లు జీవితాంతం బాధించే పరిస్థితులకు, చివరకు కాలు కోల్పోయే ప్రమాదానికి దారితీయవచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా డయాబెటిస్ బాధితుల్లో కనిపించే పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ (పీఏడీ)పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సీనియర్ కన్సల్టెంట్ వాస్కులర్ సర్జన్, ఎండోవాస్కులర్ సర్జన్, యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. శ్రీకాంత్ రాజు సూచించారు.ఖమ్మంలోని యశోద సెంటర్లో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ ఎస్. శ్రీకాంత్ రాజు మాట్లాడుతూ.. మధుమేహ బాధితుల్లో కాళ్లు, పాదాలకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులు క్రమంగా ఇరుకుగా మారడం, మూసుకుపోవడం వల్ల పీఏడీ సమస్య తలెత్తుతుందని వివరించారు. దీనివల్ల పాదాలకు అవసరమైనంత రక్తం, ఆక్సిజన్ అందక కణజాలం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. సాధారణంగా చిన్న గాయం ఏర్పడినా కొద్ది రోజుల్లో మానిపోతుంది. కానీ మధుమేహం, రక్తప్రసరణ లోపం ఉన్నవారిలో అదే గాయం మానకుండా పుండుగా మారి, ఇన్ఫెక్షన్‌కు దారితీయవచ్చని 'యశోద' లో అత్యాధునిక వైద్యంతో కంట్రోల్ చేయవచ్చని తెలిపారు.మధుమేహం వల్ల నరాలు దెబ్బతినే పరిస్థితిని డయాబెటిక్ న్యూరోపతి అంటారని, ఈ సమస్య ఉన్నవారికి పాదాల్లో గాయం అయినా, ముల్లు గుచ్చుకున్నా, బొబ్బ ఏర్పడినా నొప్పి తెలియకపోవచ్చని డాక్టర్ శ్రీకాంత్ రాజు వివరించారు. దీంతో చిన్న గాయాన్ని కూడా గుర్తించకుండా రోజులు గడిపేస్తారని, అప్పటికే అది తీవ్రమైన పుండుగా మారే ప్రమాదం ఉందన్నారు. రక్తప్రసరణ తగ్గడం, ఇన్ఫెక్షన్ తోడవడం వల్ల పరిస్థితి మరింత విషమించి, కొన్ని సందర్భాల్లో కాలు, పాదంలోని భాగాన్ని తొలగించాల్సిన దుస్థితి ఏర్పడవచ్చని హెచ్చరించారు.పీఏడీని ప్రారంభ దశలో గుర్తించేందుకు వైద్యుల సూచన మేరకు కాళ్ల రక్తప్రసరణను అంచనా వేసే యాంకిల్ బ్రాకియల్ ఇండెక్స్ (ఏబీఐ), డాప్లర్ అల్ట్రాసౌండ్ వంటి పరీక్షలు ఉపయోగపడతాయని తెలిపారు. సమస్య తీవ్రతను బట్టి మందులు, జీవనశైలి మార్పులు, యాంజియోప్లాస్టీ వంటి ఆధునిక చికిత్సలు యశోదలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రక్తనాళాల్లో ఏర్పడిన అడ్డంకులను తొలగించి రక్తప్రసరణను మెరుగుపరిచే చికిత్సలతో అనేక సందర్భాల్లో పాదాలను, కాళ్లను కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు.మధుమేహం ఉన్నంత మాత్రాన కాలు కోల్పోవాల్సిన పరిస్థితి రాదని, సరైన జాగ్రత్తలు, క్రమం తప్పని వైద్య పరీక్షలు, సకాలంలో చికిత్సతో అనేక తీవ్రమైన సమస్యలను నివారించవచ్చని డాక్టర్ శ్రీకాంత్ రాజు స్పష్టం చేశారు. పాదాల్లో వచ్చే చిన్న మార్పును కూడా నిర్లక్ష్యం చేయకుండా గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. ఒక చిన్న గాయం కారణంగా నడవలేని పరిస్థితి రావడం, కుటుంబ సభ్యులపై ఆధారపడాల్సి రావడం బాధాకరమని పేర్కొంటూ, ప్రతి మధుమేహ బాధితుడు తన పాదాలను తన ఆరోగ్య బాధ్యతలో భాగంగా భావించాలని సూచించారు. ముందస్తు అవగాహన, అప్రమత్తత, సకాలంలో చికిత్సతో కాళ్లను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీ యూనిట్ మేనేజర్లు శ్రీకాంత్, దుగ్గిరాల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జికి వనజీవి రామయ్య పేరు పెట్టాలి

- బ్రిడ్జి సమీపంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి
- బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) : ఖమ్మం జిల్లా గర్వించదగిన వ్యక్తి, పర్యావరణ పరిరక్షణకు తన జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి దరిపల్లి రామయ్య సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలని బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా కోరారు.ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ శ్రీ దివాకర టిఎస్ కి వినతిపత్రం సమర్పిస్తూ, ఖమ్మం నగరంలో నూతనంగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జికి "పద్మశ్రీ దరిపల్లి వనజీవి రామయ్య కేబుల్ బ్రిడ్జి" అని నామకరణం చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బ్రిడ్జి సమీపంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.దరిపల్లి రామయ్య తన జీవితమంతా పర్యావరణ పరిరక్షణకే అంకితం చేసి, మొక్కలు నాటుతూ, వాటిని సంరక్షిస్తూ సమాజంలో పచ్చదనంపై చైతన్యం కల్పించారని పేర్కొన్నారు. ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించిందని గుర్తుచేశారు.మన ఖమ్మం జిల్లా నుంచి ఎదిగి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఇలాంటి మహనీయుడి పేరును నగరంలోని ప్రముఖ కేబుల్ బ్రిడ్జికి పెట్టడం ద్వారా జిల్లా గౌరవం మరింత పెరుగుతుందని అన్నారు. అంతేకాకుండా ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ పట్ల భావితరాలకు గొప్ప స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి, రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసి తగిన చర్యలు తీసుకోవాలని వీరవెల్లి రాజేష్ గుప్తా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఒకటో పట్టణ అధ్యక్షులు గడిల నరేష్ పాల్గొనడం జరిగింది.

అర్హులందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం

- రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల కొత్త పెన్షన్లకు ఆమోదం.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి









కల్లూరు, నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు పట్టణంలోని వికేఆర్ ఫంక్షన్ హాల్‌లో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత పాలకులు రాష్ట్రంపై రూ. 8.21 లక్షల కోట్ల అప్పుల భారం మోపినప్పటికీ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి కోతలు విధించడం లేదన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, సన్న వడ్లు పండించే రైతులకు క్వింటాలుకు రూ. 500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 72 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు అందించడంతో పాటు మరో 14 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేశామని పేర్కొన్నారు. **మహిళా సంఘాలకు రూ. 73 వేల కోట్ల రుణాలు** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో గత 33 నెలల్లో మహిళా సంఘాలకు రూ. 73 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందించినట్లు మంత్రి తెలిపారు. మహిళలకు బస్సులు, క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ వంటి రంగాల్లో స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. **అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు** పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, హైదరాబాద్ ప్రాంతంలో మరో లక్ష ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం సుమారు రూ. 40 వేల కోట్లు ఖర్చు చేస్తోందని, లబ్ధిదారులకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 2.21 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. **4.5 లక్షల కొత్త పెన్షన్ల మంజూరు** రాష్ట్రవ్యాప్తంగా వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హుల కోసం 4.5 లక్షల నూతన పెన్షన్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. కల్లూరు మండలం, మున్సిపాలిటీ పరిధిలో పాత, కొత్త పెన్షన్లు కలిపి 1,249 మందికి ప్రతినెలా సుమారు రూ. 2.18 కోట్ల పెన్షన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పెన్షన్ మంజూరు కాని అర్హులు నిరుత్సాహపడవద్దని, దశలవారీగా అందరికీ పెన్షన్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. కల్లూరు మండలంలో రెండు విడతల్లో 1,040 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో రూ. 5 లక్షల ఆర్థిక సాయం జమ చేస్తున్నామని తెలిపారు. కల్లూరు పట్టణ అభివృద్ధికి రూ. 15 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ చైర్మన్, ఎంపీడీవో డి. చంద్రశేఖర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు కాలుష్యంపై జేఏసీ ఆందోళన

-14 ఏళ్ల బాలిక మృతిపై విచారణ జరపాలి.. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



జవహర్‌నగర్, నవంబర్ 18 (పీసీడబ్ల్యూ న్యూస్):
జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. శాంతినగర్‌కు చెందిన 14 ఏళ్ల బాలిక ఊపిరితిత్తుల సమస్యతో మృతి చెందడంపై విచారం వ్యక్తం చేస్తూ, బాలిక మరణానికి డంపింగ్ యార్డు కాలుష్యమే కారణమా అనే అంశంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని, వైద్యపరమైన విచారణ ద్వారా మరణానికి గల అసలు కారణాలను వెల్లడించాలని కోరింది. ఈ ప్రాంతంలో చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని కమిటీ నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాంకీ డంపింగ్ యార్డును శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఏసీ చైర్మన్ షేక్ షావలి, మాజీ కార్పొరేటర్ సుబ్రహ్మణ్యం, సూర వెంకటయ్య, వెంకటాచారి, గడిపే సునీత, ఆవుల దుర్గేష్, మంజుల, సునీల్, నందిని తదితరులు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరారు.

రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలన



వేంసూరు, నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) : మండలంలోని అమ్మపాలెం గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని రైతులతో నేరుగా మాట్లాడి, రీసర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, భూముల సరిహద్దులు, భూ విస్తీర్ణాలు మరియు సంబంధిత రెవెన్యూ రికార్డులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అమ్మపాలెం గ్రామ పరిధిలో మొత్తం 1,389.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ఇప్పటివరకు సుమారు 1,100 ఎకరాల భూమికి రీసర్వే ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు వివరించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని, రైతుల సందేహాలు మరియు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలోనే పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మిగిలిన రీసర్వే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

మహిళల స్వావలంబనకు సంఘాలే బంగారు బాట

- మల్లంపల్లిలో 215 మందికి చేయూత పింఛన్లు.. మూడు స్వయం ఉపాధి కేంద్రాలు ప్రారంభించిన మంత్రి సీతక్క





మల్లంపల్లి, నవంబర్ 18 (పీసీడబ్ల్యూ న్యూస్): మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా స్వయం సహాయక సంఘాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందిస్తామని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. బుధవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని లబ్ధిదారులకు ఉత్తర్వులు అందజేశారు. **మహిళలకు ఆర్థిక భరోసా** మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీతక్క పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా కిరాణా, వస్త్ర దుకాణాలు, పాల కేంద్రాలు వంటి వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. మల్లంపల్లి మండల మహిళా సంఘాలకు ఇప్పటివరకు సుమారు రూ. 20 కోట్ల రుణాలు అందించామన్నారు. ఒక్కో సంఘానికి రూ. 20 లక్షల వరకు రుణాలు, రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. **10 గ్రామాల్లో 215 మందికి పింఛన్లు** మల్లంపల్లి మండలంలోని 10 గ్రామ పంచాయతీల పరిధిలో 215 మందికి కొత్త చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. వీరిలో 138 మంది వితంతువులు, 54 మంది దివ్యాంగులు, 19 మంది ఒంటరి మహిళలు, నలుగురు గీత కార్మికులు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.60 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. అర్హత ఉండి పింఛన్ రాని వారు దరఖాస్తు చేసుకోవచ్చని, పరిశీలించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. **మూడు స్వయం ఉపాధి కేంద్రాలు ప్రారంభం** మల్లంపల్లి మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు స్వయం ఉపాధి దుకాణాలను మంత్రి ప్రారంభించారు. మహిళలు వ్యాపారాలు ప్రారంభించేందుకు బ్యాంకుల ద్వారా రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుకు అవకాశాలు పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని, అర్హులైన పేదలకు రాబోయే విడతల్లో ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం, మహిళా సంఘాల సభ్యులకు పునాది నిర్మాణం కోసం రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు వివరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ప్రమాద బీమా వంటి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. **మహిళలకు ప్రత్యేక రుణాలు** మేడారం జాతర సందర్భంగా 550 నుంచి 600 మంది మహిళలకు సుమారు రూ. 3 కోట్ల రుణాలు అందించగా, వారు రూ. 9 కోట్ల మేర వ్యాపారాలు నిర్వహించారని సీతక్క తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలు, ఇతర ఉత్సవాల్లోనూ మహిళలు వ్యాపార అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో మహిళా సంఘాల భవనాలు, వర్క్‌షెడ్లు, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం కానుందని, పథకం నిబంధనల ప్రకారం ఎంపికైన కుటుంబ సభ్యుడు మరణిస్తే రూ. 5 లక్షల బీమా రక్షణ కల్పిస్తామని తెలిపారు. కుటుంబ సంపాదన సభ్యుడిని కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని, మల్లంపల్లి మండలంలో ఇప్పటివరకు 81 కుటుంబాలకు ఈ సహాయం అందించామన్నారు. **నాలుగైదు రోజుల్లో పింఛన్ నగదు జమ** పింఛన్ల మంజూరు ఉత్తర్వులు పొందిన వారి వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి నాలుగైదు రోజుల్లో నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. పేర్ల నమోదులో పొరపాట్లు, ఒకే పేరుతో రెండుసార్లు నమోదైన దరఖాస్తులను పునఃపరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంపత్ రావు, డీఆర్డీఓ చంద్రశేఖర్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, రేగ కళ్యాణి, రవీందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేయూత పింఛన్లతో ఆర్థిక భరోసా

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం: సర్పంచ్ పసుల కార్తీక్



మల్లంపల్లి మండల ప్రతినిధి, నవంబర్ 18 (పీసీడబ్ల్యూ న్యూస్): వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని సర్పంచ్ పసుల కార్తీక్ అన్నారు. మంత్రివర్యులు సీతక్క ఆదేశాలు, మేకల ప్రశాంత్ సూచనల మేరకు గ్రామ శాఖ అధ్యక్షుడు ముంజల కుమార్ సహకారంతో నూతనంగా మంజూరైన పింఛన్ల ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ ప్రతినెలా అందే పింఛన్ సొమ్ము లబ్ధిదారుల నిత్యావసరాలు, మందుల ఖర్చులకు ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతనిప్పుల రఘు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


నేడు ఖమ్మంలో జర్నలిస్టుల నిరసన

- **జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**
- **టీజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ చిర్రా రవి డిమాండ్**



ఖమ్మం,ప్రతినిధి నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): ఖమ్మంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేడు గురువారం ఉదయం 10 గంటలకు ఖమ్మం జడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు టి యు డబ్ల్యూ జే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దశాబ్దాల తరబడి జర్నలిస్టులకు అన్యాయం జరుగుతూనే ఉందని, ప్రభుత్వాలు మారిన పాలకులు మారుతున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ కాలంలో క్యాబినెట్ ఆమోదం పొంది జీవో 147 ద్వారా కేటాయించిన స్థలాన్ని తక్షణమే జర్నలిస్టులకు బదులాయింపు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం అయ్యేవరకు దశల వారి ఉద్యమాలు కొనసాగుతాయని నేడు జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

మాజీ సర్పంచ్‌కు 'చేయూత' పెన్షన్ పత్రం అందజేత



గంగాధర నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం కొండయ్యపల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ ఆముదాల వెంకటమ్మకు నూతన 'చేయూత' పెన్షన్ మంజూరు పత్రాన్ని ఆ గ్రామ ప్రస్తుత సర్పంచ్ మల్యాల తిరుపతి (అలియాస్ వినయ్ సాగర్) బుధవారం అందజేశారు.గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆయన వెంకటమ్మ నివాసానికి వెళ్లి, ప్రభుత్వం తరఫున మంజూరైన పింఛన్ ప్రాసెసింగ్ పత్రాన్ని స్వయంగా చేతికిచ్చారు. ఈ సందర్భంగా మల్యాల తిరుపతి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. మాజీ సర్పంచ్‌కు పింఛన్ మంజూరు పత్రం అందజేయడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఎలుగుబంటి సంచారం



కరీంనగర్,నవంబర్18 (పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ పరిసరాల్లో ఎలుగుబంటి కనిపించడంతో విద్యార్థులు, స్థానిక ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఎలుగుబంటి రోడ్డుపైకి రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.యూనివర్సిటీ పరిసరాల్లో అడవులను ధ్వంసం చేయడం వల్లే వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయని, అధికారుల నిర్లక్ష్యం కూడా ఇందుకు కారణమని సోషల్ మీడియాలో నెటిజన్లు విమర్శిస్తున్నారు.ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఎలుగుబంటిని పట్టుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

● రైతులను దళారుల దోపిడీకి వదిలేస్తున్నారు: బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం





కరీంనగర్, నవంబర్ 18 (పీసీడబ్ల్యూ న్యూస్): జిల్లాలో వరి కోతలు పూర్తయినా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బుధవారం తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులు కేటాయించకపోవడంతో ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదన్నారు. ప్రభుత్వ కేంద్రాలు తెరవకపోవడంతో దళారులు రైతుల నుంచి కనీస మద్దతు ధర కంటే క్వింటాలుకు రూ. 200 నుంచి రూ. 300 తక్కువకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, నిర్లక్ష్యం వహిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు డిపాజిట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

- కరీంనగర్ న్యాయవాదుల సహకార సంఘం చైర్మన్ గడ్డం లక్ష్మణ్



కరీంనగర్ నవంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ కోర్టు పరిధిలోని న్యాయవాదుల ఆధ్వర్యంలో ఇటీవల ప్రారంభించిన కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో కోర్టుకు జమానాత్ కోసం చేస్తున్నటువంటి డిపాజిట్ సదుపాయాన్ని న్యాయవాదులు, తద్వారా కక్షిదారులు వినియోగించుకోవాలని న్యాయవాదుల సహకార సంఘం చైర్మన్ గడ్డం లక్ష్మణ్ కోరారు. ఇటీవల ప్రారంభించిన ఈ సదుపాయం సందర్భంగా ఇద్దరి పేరు మీద ఫిక్స్డ్ డిపాజిట్ బాండ్ పత్రాలను తయారు చేసి బుధవారం వారికి అందించారు. ఈ సదుపాయం వల్ల కోర్టులో నిందితుల పక్షాన జమానత్ కోసం వినియోగించే డిపాజిట్ బాండ్ లను ఇతర బ్యాంకులలో చేసుకొనే ప్రయాస తప్పినట్లయిందని ఇందుకు సహకరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్, ఇతరత్రా సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి బెజ్జెంకి శ్రీకాంత్,కోశాధికారి సుంకె దేవకిషన్,సీనియర్ న్యాయవాదులు కొరివి వేణుగోపాల్,గౌరు రాజిరెడ్డి,రాజు, సామ్యూల్,వెంకటేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రముఖుల చేయూత

● పుస్తక పఠన ప్రోత్సాహానికి ప్రత్యేక సభ్యత్వాలు ● 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో చైర్మన్ యండి. ఖాదర్ బాబా వినూత్న చొరవ ● జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక సభ్యత్వాల నమోదు









ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్) : పుస్తకం మనిషికి మంచి నేస్తం.. గ్రంథాలయం సమాజానికి విజ్ఞాన భాండాగారం. నేటి ఆధునిక యుగంలోనూ పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తుచేస్తూ, గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ యండి. ఖాదర్ బాబా ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పలువురు ప్రముఖులకు ప్రత్యేక సభ్యత్వాలు అందించారు.గ్రంథాలయాల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరికీ అందులో భాగస్వామ్యం ఉందనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడంతోపాటు, భావితరాలకు విజ్ఞాన సంపదను అందించాలనే లక్ష్యంతో ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులను గ్రంథాలయ సభ్యులుగా చేర్చడం విశేషంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో పద్మశాలి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ కమర్తపు మురళి, మాజీ కార్పొరేటర్లు పాకలపాటి శేషగిరి, రాపర్తి శరత్ కుమార్, కన్నం ప్రసన్న, గజ్జెల వెంకన్న, దోన్వాన్ రవినాయక్, సుద్రగాని ఉపేందర్, చెరువు బజార్ హనుమాన్ టెంపుల్ చైర్మన్ మడూరి సైదారావు, బాలుసు లక్ష్మీ నాగేశ్వరరావు ప్రత్యేక సభ్యత్వాలు స్వీకరించారు. లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులు సైతం గ్రంథాలయంలో సభ్యత్వాలు తీసుకుని పఠనాభివృద్ధికి తమ వంతు ప్రోత్సాహాన్ని అందించారు.ఈ సందర్భంగా చైర్మన్ యండి. ఖాదర్ బాబా మాట్లాడుతూ.. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు భద్రపరిచే కేంద్రాలు మాత్రమే కావని, అవి సమాజ విజ్ఞాన వికాసానికి, యువత భవిష్యత్తుకు బాటలు వేసే జ్ఞాన నిలయాలని పేర్కొన్నారు. పుస్తక పఠనం మనిషిలో ఆలోచనా శక్తిని, విజ్ఞానాన్ని, వ్యక్తిత్వాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల్లో సభ్యత్వం తీసుకుని పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని కోరారు.ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు గ్రంథాలయాల అభివృద్ధిలో భాగస్వాములైతే మరింత మందికి పఠనంపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారికి పుస్తకాలతో స్నేహం చేయించడం ద్వారా జ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి పునాది వేయవచ్చని అభిప్రాయపడ్డారు.జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రజల్లో పఠనాసక్తిని పెంపొందించడం, గ్రంథాలయాలను మరింత బలోపేతం చేయడం, అన్ని వర్గాల ప్రజలను విజ్ఞాన ప్రపంచానికి చేరువ చేయడం లక్ష్యంగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్-1 గ్రంథపాలకులు సిహెచ్. మాల్సూర్, గ్రేడ్-3 గ్రంథపాలకులు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, జె. భాస్కర్ రావు, ఇతర గ్రంథాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్లను వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన శంకరపట్నం బీజేపీ నాయకులు



శంకరపట్నం, నవంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్): శంకరపట్నం మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు పండించిన వడ్లను వెంటనే కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీజేపీ మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేసి అన్నదాతలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దండు కొమురయ్య, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు జంగ జైపాల్, జిల్లా కౌన్సిల్ సభ్యులు దాసరపు నరేందర్, సీనియర్ నాయకులు కొయ్యడ అశోక్, కాంతాల రాజిరెడ్డి, జానపట్ల రాజిరెడ్డి, చెర్ల శ్రీనివాస్, దాసరి సంపత్ పాల్గొన్నారు. వీరితో పాటు మండల ఉపాధ్యక్షులు కనకం సాగర్, రాసమల్ల శ్రీనివాస్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు కనకం కుమార్, మండల కోశాధికారి బోడ తిరుపతి, బీజేవైఎం మండల అధ్యక్షులు బొజ్జ సాయిప్రకాష్, సోషల్ మీడియా కన్వీనర్ కునారపు శ్రీనాథ్ యాదవ్, బొంతల రవి తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను బి.ఆర్.ఎస్ నాయకులు చింపి చెత్త బుట్టలో వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ,సెల్ అధ్యక్షులు





కరీంనగర్ నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను చింపి చెత్తబుట్టలో వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, బి.ఆర్.ఎస్ 10 సంవత్సరాల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు పరిచారో శ్వేతా పత్రం విడుదల చేయాలని జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి తాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షులు బానోతు శ్రావణ్ నాయక్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏం డి తాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు మాత్రమే అవుతుంది, అయినా కూడా మేనిఫెస్టో లోని వాటిని ఒక్కొక్కటిగా అమలు పరుస్తున్నామనీ,గత మీ బి.ఆర్.ఎస్ పాలనలో సంవత్సరానికి లక్ష ఉద్యోగాలు ఇస్తామని ఒక్క ఉద్యోగం అయిన ఇచ్చినారా? కాంగ్రెస్ నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ఇస్తామంటే, మీరు 3016 రూపాయలు ఇస్తామని చెప్పి ఒక్కరికైనా ఇచ్చారా, మీ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇచ్చిన దాఖలాలు ఉంటే చూపించండి. మౌలానా అబుల్ కలాం ఆజాద్ యూనివర్సిటీ తెస్తామని డ్యామ్ వద్ద తూతూ మంత్రంగా భూమి పూజ చేసి చేతులు దులుపుకున్నారు. మిగులు బడ్జెట్ గా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 10 సంవత్సరాల కాలంలో అప్పుల మయంగా చేశారని అన్నారు.కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. నిన్నటి రోజు గంగుల కమలాకర్ మరియు వారి బి.ఆర్.ఎస్ బృందం కాంగ్రెస్ మేనిఫెస్టోను చింపి చెత్తబుట్టలో పారేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. బి. ఆర్. ఎస్, వారిని ఆత్మవిమర్శన చేసుకోవాలని, గత పది సంవత్సరాల కాలంలో మీరు చేసిన నీచ, నిరంకుశ పాలను చూసి ప్రజలు మీకు పాలన చేత కాదని, మిమ్మల్ని చెత్తబుట్టలో వేశారని అన్నారు. కేవలం మూడు సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను చూసి ఓర్వలేక పోతున్నారు. ఇంత అక్కస్సు ఎందుకు మీకు. అయ్యా జీవన్ రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు పొంది, ఇప్పుడు బి. ఆర్. ఎస్, పార్టీలో చేరి కాంగ్రెస్ పార్టీని విమర్శించడం మీకు సభబా, ఆనాడు ఇదే మేనిఫెస్టో రూపొందించే టైములో మీరు కూడా ఉండి సలహాలు ఇచ్చినారు కదా? ఇది న్యాయమా మీకు? ఒక్క కరీంనగర్ లోనే కాదు తెలంగాణ మొత్తంలో కూడా బి. ఆర్. ఎస్ పార్టీ ఖతం అయ్యిందని అన్నారు.పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్తో మీకు అప్పజెప్పితే, దోచుకొని అప్పుల మయంగా చేసిన ఘనత బి.ఆర్.,ఎస్ పార్టీది కాదా? కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన నుండి 16 లక్షల రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీది, ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ, ఏడు లక్షల 15 వేల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి, రైతులకు రెండు లక్షల రుణాలు మాఫీ చేసినాము. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మొదటి దశలో, రెండో విడతలో 2 వేల ఇండ్లు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి అని అన్నారు.బానోతు శ్రావణ్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను మీరు డస్ట్ బిన్ లో వేయడం కాదు ఆల్ రెడీ మిమ్మల్ని,మీ పార్టీని చెత్త కుండీలో ప్రజలు ఎప్పుడో వేశారు. రేపు ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రేవంత్ రెడ్డి గారు సిద్దిపేటలో ఇందిరా గాంధీ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తున్నారని మనసున పట్టక ఇలాంటి పిచ్చి పనులు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మి పథకం, సన్నబియ్యం, 200 యూనిట్ల కరెంట్,ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు,ఉద్యోగాలు, ఇచ్చింది.ఇది కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు కలీముద్దీన్, నూనె గోపాల్ రెడ్డి, ఎండి చాంద్, సత్తినేని శ్రీకాంత్, రంగ నాయక్, సుధాకర్ నాయక్, పాల్గొన్నారు.

కమలాపూర్‌లో నూతన పెన్షన్ లబ్ధిదారులకు పత్రాల పంపిణీ

- లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

కమలాపూర్ నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం నూతన పెన్షన్ లబ్ధిదారులకు వితంతువు, ఒంటరి మహిళ, వికలాంగులు గీత కార్మికులు,పద్మశాలీ కార్మికులకు పంపిణీ పత్రాలు హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.పెన్షన్ మంజూరులో కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమేనని, 360 డిగ్రీ యాప్ తీసుకొచ్చిన ప్రభుత్వం కొంతమంది అసలైన లబ్ధిదారులకు శాపంగా మారిందని,దళిత బంధు లబ్ధిదారులకు,వెహికల్స్ ఉన్నవారికి,అమ్ముకున్న వారికి, వారి పేర్ల మీదనే ఉన్నందువల్ల వారికి పెన్షన్ రావడం లేదని అధికారులు చెబుతున్నారు, ప్రభుత్వం ఆలోచన చేసి పేదలందరికీ పెన్షన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే అన్నారు. వితంతువు,వికలాంగులు ఒంటరి మహిళలు, గీత కార్మికులు,పద్మశాలి కార్మికులు అందజేస్తున్న ప్రభుత్వం వృద్యాప పెన్షన్స్ నిలిపివేయడం బాధాకరమని,వారికి కూడా తక్షణమే మంజూరు చేయాలని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ లబ్ధిదారులకు2000వేల పెన్షన్ ను 4000కు, 4000 పెన్షన్ ను 6000 ల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గం లో చాలా మంది అర్హత ఉండి పెన్షన్ రాని వాళ్ళు ఉన్నారని వారి దరఖాస్తులను పునఃపరిశీలించి ఎంపీడీవో లు పంచాయతీ కార్యదర్శులు సర్వే చేసి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఎల్ నినో ప్రభావంతో తీవ్ర నీటి సమస్య వచ్చే అవకాశం ఉన్నందున త్రాగడానికి మంచినీళ్లు దొరికే పరిస్థితి ఉండదని,రెండు మూడు నెలల ముందే పక్కా ప్రణాళికతో సర్పంచ్ ల సహకారంతో పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో,ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు







కలగకుండా ఏర్పాటు చేయాలని సూచించారు.అనంతరం కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్ కు, హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబుకు నూతన పెన్షన్ దార్లతో కలిసి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా కమలాపూర్ మండల కేంద్రంలో పండగ వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో కమలాపూర్ ఎంపీడీవో గుండె బాబు, తాహసిల్దార్ ఎం సురేష్ కుమార్ ,మండల ప్రత్యేక అధికారి, ఫ్యాక్స్ చైర్మన్ పేరాల సంపత్ రావు,మాజీ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బీంపల్లి సర్పంచ్ వాసాల శ్రీనివాస్, సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కౌడగాని రాజేష్,కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలసాని రమేష్ గౌడ్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ మౌటం కుమారస్వామి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పిఎసిఎస్ డైరెక్టర్ తక్కల్లపల్లి సత్యనారాయణ రావు,మర్రిపల్లిగూడెం చేనేత సహకార సంఘం అధ్యక్షులు ఫోరండ్ల రమేష్,కాంగ్రెస్ నాయకులు పోడేటి భిక్షపతి, అన్ని గ్రామాల సర్పంచ్‌లు ప్రజాప్రతి నిధులు, పంచాయతీ కార్యదర్శులు,వివిధ శాఖల అధికారులు,మార్కెట్ డైరెక్టర్లు,మాజీ ప్రజా ప్రతినిధులు ,నూతన పెన్షన్ లబ్ధిదారులు కాంగ్రెస్,బిజెపి,బి ఆర్ఎస్ చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ ప్రొసీడింగ్స్ అందజేసిన కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ కుమార్

● డివిజన్‌లో అర్హులైన ప్రతిఒక్కరికి పెన్షన్లు అందిస్తాం: కార్పొరేటర్ ప్రవీణ్ కుమార్



కరీంనగర్, నవంబర్ 18(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 50వ డివిజన్‌లో నూతనంగా మంజూరైన 'చేయూత' పెన్షన్ల ప్రొసీడింగ్ కాపీలను స్థానిక కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. బుధవారం డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఆయన లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి, మరికొందరిని కలిసి ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ మంజూరు పత్రాలను స్వయంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పెన్షన్లు ఆర్థికంగా ఎంతో దోహదపడతాయన్నారు.డివిజన్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందేలా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పెన్షన్ల మంజూరు విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉండి ఇంకా పింఛన్ రాని వారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.తమకు పెన్షన్ మంజూరు చేయించి, ప్రొసీడింగ్ పత్రాలను అందజేసినందుకు లబ్ధిదారులు కార్పొరేటర్ బోయిన్ పల్లి ప్రవీణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు, డివిజన్ ముఖ్య కార్యకర్తలు, కాలనీవాసులు , లబ్ధిదారులు పాల్గొన్నారు.

జన్మదిన వేడుకల సందర్భంగా నిరుపేదలకు అన్నదానం..

- కరీంనగర్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ సేవా కార్యక్రమం..





కరీంనగర్, నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మీల్స్ ఆన్ వీల్స్ ఆకలి నివారణ' సేవా కార్యక్రమాన్ని కరీంనగర్‌లోని మార్కెట్ వెంకటేశ్వర స్వామి దేవాలయం పక్కన విజయవంతంగా నిర్వహించారు.చిందం చిత్రరేఖశ్రీనివాస్ దంపతుల కుమారుడు చిరంజీవి చిందం సిద్ధార్థ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిరుపేదలు, అవసరమైన వారికి భోజనంతో పాటు అరటిపండ్లను పంపిణీ చేశారు. సిద్ధార్థ పటేల్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, విజయాలతో, ఉజ్వల భవిష్యత్తుతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐత సూరజ్ కుమార్, రాపెల్లి రవీందర్ రావు, డాక్టర్ తుంగూరి కార్తీక్, డాక్టర్ అర్చన, రామ్‌శ్యామ్, అభిషేక్, జగదీష్, ముక్క శరత్ కృష్ణ, మైదం శివకాంత్ పటేల్, బట్టు వినోద్ పటేల్, పెద్ది విద్యాసాగర్, బొడ్ల రవీందర్, చిదుర సురేష్, కోల అన్నారెడ్డి తదితరులు పాల్గొని తమ సహకారాన్ని అందించారు.లయన్స్ క్లబ్ అధ్యక్షులు, మీల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కోఆర్డినేటర్ మైదం శివకాంత్ పటేల్ మాట్లాడుతూ, ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం గొప్ప మానవతా సేవ అని అన్నారు. జన్మదినాలు, ఇతర శుభ సందర్భాలను సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. దాతలు, మిత్రుల సహకారంతో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని తెలిపారు.

జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

- తాగునీటి సరఫరాలో లీకేజీలు, నీటి వృథాను అరికట్టాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

కర్నూలు నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):జిల్లాలో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంజనీరింగ్ పనుల పురోగతి పై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ కింద జిల్లాలో మొత్తం 423 పనులు ఉండగా, ఇప్పటివరకు 345 పనులు పూర్తయ్యాయని, మరో 78 పనులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయని, పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ డిఈ లను ఆదేశించారు. ఆదోని, ఆలూరు, కర్నూలు, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మిగనూరు తదితర సబ్ డివిజన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా పనులు నెమ్మదిగా జరుగుతున్నట్లయితే అందుకు గల కారణాలను గుర్తించి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు



తీసుకోవాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ని ఆదేశించారు.. పనులు ప్రారంభించకుండా లేదా నిర్దేశిత వేగంతో పూర్తి చేయకుండా జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లతో వెంటనే సమావేశం నిర్వహించి, పనులు ప్రారంభించేందుకు అవసరమైన సూచనలు ఇవ్వాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ ని ఆదేశించారు.ఫంక్షనల్ హౌస్‌హోల్డ్ ట్యాప్ కనెక్షన్ల లో భాగంగా సబ్‌డివిజన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న పనులపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదోని సబ్‌డివిజన్‌లో 443, కర్నూలు సబ్‌డివిజన్‌లో 1100, మంత్రాలయంలో 1300, పత్తికొండలో 1500,ఎమ్మిగనూరులో 1900 చొప్పున పనులు పెండింగ్ లో ఉన్నాయని, పనుల పురోగతిని వేగవంతం చేసి, పెండింగ్ లక్ష్యాలను ఫిబ్రవరి 15లోగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఐహెచ్‌హెచ్‌ఎల్ నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో తాగునీటి సరఫరాలో ఎక్కడా లీకేజీలు లేకుండా చూడాలని, నీటి వృథాను పూర్తిస్థాయిలో అరికట్టాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో నీటి లభ్యత చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం నీటి పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న పరిమిత నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, ఆర్డబ్ల్యూఎస్ డిఈ లు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

- భాకరాపేటలో ప్రయాణికుల అవస్థలు

సిద్ధవటం నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): సిద్ధవటం మండలంలోని భాకరాపేట బస్టాండ్ కూడలిలో బద్వేల్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు సమయపాలన లేకుండా నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. అత్యవసర పనులపై ప్రయాణించాల్సిన వారు బస్సుల కోసం నిరీక్షిస్తూ విసుగుచెందుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ ఇదే పరిస్థితి కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించి బద్వేల్ వైపు వెళ్లే బస్సులను నిర్ణీత సమయాలకు నడిపేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

23న మున్సిపల్ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

ఎమ్మెల్యే వరద.ప్రతిపాదిత చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డిలను నేరుగా ఆహ్వానించిన కమిషనర్

ప్రొద్దుటూరు నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రొద్దుటూరు మున్సిపల్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 23న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రోజు అనంతరం జరగనున్న వైస్ చైర్మన్ ఎన్నికకు హాజరుకావాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, నూతన చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి ఫారం-2 ద్వారా ఆహ్వానించారు. అలాగే ఎక్స్ అఫీషియో సభ్యుడైన కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి ఆహ్వానం అందించేందుకు మున్సిపాలిటీ తరఫున ప్రత్యేక దూత కూరకు విజయ్ బాబును పులివెందులకు పంపించారు. ఎంపీ ఎన్నికల షెడ్యూల్‌లో బిజీగా ఉండటంతో ఆయన సూచన మేరకు పేషీ సిబ్బంది ప్రశాంత్ రెడ్డికి ఫారం-2 అందజేసి, ఎంపీ అధికారిక కార్యక్రమాల షెడ్యూల్‌లో తేదీని నమోదు చేయాలని కోరారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కౌన్సిల్ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అవసరాలు, పట్టణ అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని నూతన పాలకవర్గం సమష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే, ఎంపీల సహకారంతో పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ వంటి ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని పేర్కొన్నారు. చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నూతన కౌన్సిలర్లకు మున్సిపల్ చట్టాలు, ప్రభుత్వ విధానాలు, పాలనా వ్యవహారాలపై అవగాహన కల్పించి, ప్రజాప్రతినిధులుగా వారి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేలా సహకరిస్తామని కమిషనర్ తెలిపారు.

లోయోలా డిగ్రీ కళాశాలలో స్పాట్,మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశాలు

- కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.జోజి రెడ్డి

పులివెందుల నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్): పులివెందులలోని లోయోలా డిగ్రీ కళాశాల (వైఎస్ఆర్ఆర్ – అటానమస్)లో 20262027 విద్యా సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సులలో స్పాట్ అడ్మిషన్లు మరియు మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశాలు కల్పించబడుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్.జోజి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరాలనుకునే ఆసక్తి గల విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి,తమ ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలు (సర్టిఫికెట్లు), ఇతర అవసరమైన పత్రాలతో కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కళాశాలలో ఉన్నత విద్యను అభ్యసించాలని ప్రిన్సిపాల్ కోరారు.



మా అమ్మ నా సినిమానే ముందు చూస్తుంది: దుల్కర్



మలయాళ స్టార్ నటుడు దుల్కర్ సల్మాన్ నటించిన తాజా తెలుగు చిత్రం 'ఆకాశంలో ఒక తార'. ఈ సినిమా నవంబర్ 20న బాక్సాఫీస్ ముందుకు రాబోతోంది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, సరిగ్గా అదే రోజు ఆయన తండ్రి, దిగ్గజ నటుడు మమ్ముట్టి నటించిన తమిళ చిత్రం 'ఓం' కూడా థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది. ఈ పోటీపై దుల్కర్ సల్మాన్ సరదాగా స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

దర్శకుడు పవన్ సాధినేని రూపొందించిన 'ఆకాశంలో ఒక తార' చిత్రానికి సంబంధించి చెన్నైలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో దుల్కర్ సల్మాన్ పాల్గొన్నారు. ఒకే రోజున తండ్రీకొడుకుల చిత్రాలు విడుదల కానుండటంతో పోటీ తీవ్రంగా ఉంటుందా? అలాగే ఇంట్లో అమ్మ ఎవరి సినిమాను ముందుగా చూస్తారు? అని విలేకరులు దుల్కర్‌ను ప్రశ్నించారు.

ఈ ప్రశ్నకు దుల్కర్ చిరునవ్వుతో బదులిస్తూ.. తన తల్లి ఎల్లప్పుడూ తన వైపే ఉంటుందని, తన సినిమానే ముందుగా చూస్తుందని చమత్కరించారు. "నేను ఇన్ని సంవత్సరాలుగా నటిస్తున్నాను.. మీ అమ్మ నా సినిమాల గురించి ఎప్పుడూ ఇలా అడగలేదు, అలాగే నా చిత్రాలను ఇంత శ్రద్ధగా ఎప్పుడూ చూడలేదు. నువ్వు ఇండస్ట్రీకి వచ్చాకే నీ సినిమాలన్నింటినీ ఆమె ఎంతో ఆసక్తిగా చూస్తోంది అని మా నాన్న ఎప్పుడూ నాతో అంటుంటారు" అని దుల్కర్ సరదాగా పేర్కొన్నారు.అనంతరం ఈ పరిణామంపై ఆయన వివరిస్తూ.. ఇది తమకు ఒక గొప్ప ఆశీర్వాదం వంటిదని అన్నారు. "మేమిద్దరం మలయాళ నటులం. అయినప్పటికీ నా చిత్రం నేరుగా తెలుగులో వస్తుండగా, మా నాన్న చిత్రం 'ఓం' నేరుగా తమిళంలో విడుదలవుతోంది. ఇద్దరి చిత్రాలు ఒకేసారి రావడం మా ఇద్దరికీ ఎంతో సంతోషకరమైన, గర్వించదగ్గ సందర్భం" అని ఆయన తెలిపారు.

ఇక 'ఆకాశంలో ఒక తార' విషయానికి వస్తే, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఇప్పటికే 'యూ/ఏ') సర్టిఫికెట్ జారీ చేసింది. ఇటీవల విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది.

చెక్ బౌన్స్ కేసులో నిర్మాత బండ్ల గణేశ్‌కు ఏడాది జైలు శిక్ష




టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు న్యాయస్థానంలో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. చెక్ బౌన్స్ కేసులో ఆయనకు ఒంగోలు కోర్టు ఏడాది సాధారణ జైలు శిక్ష విధించింది. శిక్షతో పాటు రూ. 95 లక్షల భారీ జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కీలక తీర్పు వెలువరించారు.

పూర్తి వివరాల్లోకి వెళితే... ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జెట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి బండ్ల గణేశ్ తన నిర్మాణ సంస్థ 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్' పేరిట రూ. 95 లక్షల విలువైన చెక్ ఇచ్చారు. అయితే, బ్యాంక్ ఖాతాలో సరిపడా నిధులు లేకపోవడంతో ఆ చెక్ బౌన్స్ అయింది. నగదు చెల్లింపు విషయంలో న్యాయం జరగకపోవడంతో బాధితుడు ఒంగోలు కోర్టును ఆశ్రయించారు.

ఈ కేసుపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం, నేరం రుజువు కావడంతో కోర్టు బండ్ల గణేశ్‌ను దోషిగా తేల్చింది. ఆయనకు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 95 లక్షల జరిమానా విధించింది. జరిమానా మొత్తంతో పాటు, ఈ కేసు విచారణ నిమిత్తం బాధితుడికి అయిన కోర్టు ఖర్చులను కూడా బండ్ల గణేశే పూర్తిగా భరించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు.గతంలోనూ పలు చెక్ బౌన్స్ కేసుల్లో బండ్ల గణేశ్‌కు న్యాయస్థానాలు జైలు శిక్షలు విధించగా, ఆయన పైకోర్టుల్లో అప్పీల్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే.

తమిళంలోకి ఆనంద్ దేవరకొండ సినిమా



టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడు, యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన తెలుగులో నటించిన క్రైమ్ కామెడీ చిత్రం 'గం గం గణేశా' ఇప్పుడు తమిళ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాను తమిళంలో 'జై జై గణేశా' పేరుతో అనువదించి విడుదల చేస్తున్నారు. జేజే మూవీస్ పతాకంపై నిర్మాత విజయ్ మాధవన్ ఈ చిత్రాన్ని తమిళంలో రిలీజ్ చేస్తున్నారు. పూర్తిస్థాయి యాక్షన్, థ్రిల్లర్, కామెడీ అంశాలతో వినోదాత్మక చిత్రంగా దీనిని రూపొందించారు. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ సరసన నయన్ సారిక, ప్రగతి శ్రీవాస్తవ హీరోయిన్లుగా నటించారు. ప్రతినాయకుడి పాత్రలో రాజ్ అరుణ్ నటించగా, దర్శకుడు ఉదయ్ బొమ్మిశెట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. వెన్నెల కిశోర్, సత్యం రాజేష్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

తెలుగులో ఒక చిన్నపాటి దొంగ పాత్రలో ఆనంద్ దేవరకొండ నటన, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విభిన్న కథలతో తెలుగులో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఆనంద్ దేవరకొండ, ఇప్పుడు 'జై జై గణేశా' ద్వారా కోలీవుడ్ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమయ్యారు.

గోదారి గట్టు, మీసాల పిల్లను మించి మరోటి..!



2027 సంక్రాంతి పండుగ కొన్ని నెలలు ఉండగానే తెలుగు సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా సంక్రాంతికి విడుదల కాబోతున్న సినిమాల కోసం ఎదురు చూస్తున్నారు. సంక్రాంతి అనగానే తెలుగు సినిమా ఇండస్ట్రీలో అనిల్ రావిపూడి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన బ్యాక్ టు బ్యాక్ సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు సినిమాలతో వచ్చాడు. ఆ రెండు సినిమాలు ఏ రేంజ్ విజయాన్ని సొంతం చేసుకున్నాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కాకుండానే కేవలం తెలుగు వర్షన్‌తో ఏకంగా రూ.300 కోట్లు అంతకు మించి వసూళ్లు చేసిన సినిమాలుగా రికార్డ్ సృష్టించాయి. రాజమౌళి సినిమాలకు సైతం సాధ్యం కాని రికార్డ్‌లను అనిల్ రావిపూడి తన సంక్రాంతి సినిమాలతో సొంతం చేసుకున్నాడు. అందుకే ఆయన నుంచి 2027 సంక్రాంతికి రాబోతున్న 'జనవరి 12 విడుదల' సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. సంక్రాంతికి జనవరి 12 విడుదల సినిమా... వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లు హీరోలుగా నటిస్తూ ఉండగా కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్స్‌గా కనిపించబోతున్నారు. వెంకటేష్‌కి జోడీగా కీర్తి సురేష్ నటిస్తూ ఉండగా, కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టి కనిపించబోతుంది. వెంకటేష్, కళ్యాణ్ రామ్‌లు బావ బామ్మర్ది కావడంతో వినోదం పీక్స్‌లో ఉంటుందని తెలుస్తోంది. కళ్యాణ్ రామ్‌కి అక్కగా లేదా చెల్లిగా కీర్తి సురేష్ కనిపించబోతుంది. వీరిద్దరి కాంబో సీన్స్ ఫుల్ టు కామెడీ అన్నట్లుగా ఉండబోతున్నట్లు యూనిట్ సభ్యులు చెబుతున్నారు. అంతే కాకుండా వెంకటేష్, కీర్తి సురేష్ కాంబోలో వచ్చే సీన్స్ సైతం గతంలో వచ్చిన ఎఫ్ 2 సినిమాను గుర్తు చేస్తాయని అంటున్నారు. మొత్తానికి సినిమాపై అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. దాంతో సినిమా నుంచి ఎప్పుడు ప్రమోషనల్ స్టఫ్ విడుదల అవుతుందా, పాటలు ఎప్పుడు వస్తాయా అని అభిమానులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్, కళ్యాణ్ రామ్... అనిల్ రావిపూడి గత సంక్రాంతి సినిమాలు అయిన సంక్రాంతికి వస్తున్నాం నుంచి మొదటి పాటను డిసెంబర్ నెలలో విడుదల చేయగా, మన శంకరవర ప్రసాద్ గారు సినిమా మొదటి పాటను మూడు నెలల ముందుగానే అంటే అక్టోబర్‌లోనే విడుదల చేయడం జరిగింది. ఆ రెండు పాటల వల్ల సినిమాల యొక్క మార్కెట్ డబుల్ అయింది, ప్రేక్షకుల్లో అంచనాలు రెండు మూడు రెట్లు పెరిగాయి అనడంలో సందేహం లేదు. అందుకే అనిల్ రావిపూడి 'జనవరి 12 విడుదల' సినిమా మొదటి పాట విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ మొదటి వారంలో జనవరి 12 విడుదల సినిమా నుంచి మొదటి పాట విడుదలకు రెడీ అవుతోంది. ఇప్పటికే సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ రెడీ చేసినట్లు తెలుస్తోంది. ఆ పాటకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ వీడియోను చిన్న కామెడీ స్కిట్‌గా రెడీ చేశారని కూడా యూనిట్ సభ్యుల నుంచి సమాచారం అందుతోంది.

ఆ మూవీ సెట్లో టార్చర్ చూపించారు.. - పూజిత పొన్నాడ!



ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నంకు చెందిన పూజిత పొన్నాడ ఇంజనీరింగ్ పూర్తి చేసి టాటా కన్సల్టెన్సీ లో ఉద్యోగం చేస్తున్న సమయంలోనే.. తనకంటూ ఒక ఐడెంటిటీ క్రియేట్ చేసుకోవడానికి సినిమా రంగంలోకి అడుగు పెట్టింది. అలా తొలిసారి 2015లో 'ఉప్మా తినేసింది' అనే షార్ట్ ఫిల్మ్ తో కెరియర్ మొదలుపెట్టిన ఈమె.. 2016లో ఊపిరి చిత్రంలో గ్యాలరీ మేనేజర్ గా నటించి.. ఆ తర్వాత రంగస్థలం సినిమాలో ఆది పినిశెట్టి ప్రియురాలిగా పద్మ క్యారెక్టర్ తో ప్రేక్షకులను అలరించింది పూజిత. తర్వాత రాజుగాడు, బ్రాండ్ బాబు, హ్యాపీ వెడ్డింగ్, 7 , కల్కి వంటి చిత్రాలలో కీలక పాత్రలు పోషించిన పూజిత.. తొలిసారి హీరోయిన్ గా నటించిన చిత్రం వేర్ ఈజ్ ది వెంకటలక్ష్మి.. అదే నేను చేసిన తప్పు కూడా.అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో తనకు టార్చర్ అంటే ఏంటో చూపించారు అంటూ దాదాపు ఏడేళ్ల తర్వాత తాను అనుభవించిన ఇబ్బందులను బయటపెట్టి అందరిని ఆశ్చర్యపరిచింది పూజిత పొన్నాడ.

గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమా హారర్ డ్రామాగా రూపొందుతోంది. ఇందులో సస్పెన్స్, ఎమోషన్స్ కీలకంగా ఉండనున్నాయి. పైగా కమిటీ కుర్రోళ్ళు సేమ్ ఈశ్వర్ రాచిరాజు ఇందులో హీరోగా నటిస్తున్నారు. నందు, లిఖిత తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.నన్ను నేను ప్రూవ్ చేసుకోవడానికి మంచి ప్లాట్ఫారం దొరికింది అనుకున్నాను. కానీ ఆ సినిమా షూటింగ్ సెట్లోకి అడుగుపెట్టాక తొలిసారి నా జీవితంలో వరస్ట్ సిచువేషన్ ని ఫేస్ చేశాను. ముఖ్యంగా ఈ విషయాన్ని నేను ఎప్పుడూ ఎక్కడ ఎవరితోనో చెప్పుకోలేదు. ఈ సినిమా షూటింగ్ సమయంలో నన్ను టార్చర్ చేశారు. బలవంతంగా నటించమని ఇబ్బంది పెట్టారు. నిజానికి నేను చాలా స్ట్రైట్ ఫార్వర్డ్ గా ఉంటాను. కానీ ఈ సినిమా సమయంలో నేను చాలా ఇబ్బంది పడ్డానముఖ్యంగా నేను ఇండస్ట్రీలోకి అప్పుడే కొత్తగా వచ్చాను. ఇండస్ట్రీ గురించి ఏమీ తెలియదు. పైగా ఎవరు తెలియదు. నిజానికి నేను రంగస్థలం, మైత్రి మేకర్స్ వంటి మంచి టీమ్లతో పనిచేశాను. అందులో సుకుమార్ , రామ్ చరణ్ లతో పని చేయడం చాలా అద్భుతంగా అనిపించింది. నేను రంగస్థలం సినిమా కోసం ఏడు రోజులు మాత్రమే పని చేశాను. ఆ సినిమా షూటింగ్ కూడా రాత్రివేళలో జరిగింది.